

రుణపరపతి పెరిగింది

రైతులకు రుణ పరపతి పెరిగింది. ఈ మేరకు బ్యాంకులకు మార్గదర్శకాలు వచ్చాయి.

- 8లో



ఆదిత్యునికి ప్రత్యేక పూజలు

అరసవల్లి ఆదిత్యునికి ప్రత్యేక పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు.

- 8లో



టెక్కలిలో చోరీ

టెక్కలిలో ఓ ఇంటిలో చోరీ జరిగింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

- 8లో

న్యూస్‌రీల్

ఉత్సాహంగా జిల్లాస్థాయి చెస్ ఎంపిక పోటీలు



ఎంపికైన క్రీడాకారులతో చెస్ సంఘ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి అండర్-19 బాలబాలికల చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక పోటీలు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. శ్రీకాకుళం నగరంలోని నానుబాల వీధిలో గల చెస్ శిక్షణా కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్-19 చెస్ ఎంపిక పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకున్నారు. రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికయ్యేందుకు తమ మెదడుకు పనిచెప్పారు. ఎత్తుకు పైఎత్తులేశారు. ఈ పోటీల్లో వై.సేతుమాధవ్, బగ్గు అభినవ్, జీవన్, రిత్విక్‌సాయి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని జిల్లా కార్యదర్శి జామి రమేష్ తెలిపారు. వీరంతా వచ్చేనెల 18వ తేదీ నుంచి నంద్యాలలో జరగబోయే రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. ఎంపికైన క్రీడాకారులకు ఏపీ రాష్ట్ర చెస్ సంఘ కార్యదర్శి సనపల భీమారావు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి వైఎస్‌వీ కుమార్, అసోసియేషన్ సభ్యులు అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

'శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయం'



శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ సేవలను దేశం మరువలేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు అన్నారు. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం శ్రీకాకుళం నగరంలోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కశ్మీర్ భారత్‌లో అంతర్భాగం అని కశ్మీర్ వెళ్లడానికి ఆంక్షలు ఏమిటని ప్రశ్నించిన మొదటి వ్యక్తిగా ఆయన గుర్తింపు పొందారని, దేశ ఐక్యత కోసం ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. జూన్ 23 మొదలుకుని జూలై 6న తేదీన శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి వరకు చెట్లు నాటే కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పొన్నాడ సంజీవరావు, కోరాడ అప్పలరాజు, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పేడాడ సూర్యకుమారి, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి రాజేశ్వరి, బూత్ అధ్యక్షుడు నల్లాన ప్రసాద్, విజయకుమార్, మురళీరాజు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలు వద్దంటూ..



కాశీబుగ్గలో మాదకద్రవ్యాలతో నష్టమనే షార్ట్‌ఫిల్మ్ షూటింగ్‌లో ఓ సన్నివేశం

కాశీబుగ్గ: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలనే ఇతివృత్తంతో ఓ షార్ట్‌ఫిల్మ్‌ను చిత్రీకరిస్తున్నారు. సంబంధిత షూటింగ్ పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఆదివారం జరిగింది. కాశీబుగ్గ నుంచి అక్కుపల్లి వెళ్లే రోడ్డులో నటీనటులతో సన్నివేశాలు తీశారు. రామానాయుడు స్టూడియోలో దర్శకునిగా కోర్సు పూర్తి చేసుకున్న వజ్రపుకొత్తూరు మండలం గల్లి గ్రామానికి సంపతిరావు హేమసుందర్ దర్శకత్వంలో, గ్రీన్‌ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్ నిర్మాతగా ఈ లఘుచిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ నెల 26వ తేదీన శ్రీకాకుళం పోలీసు శాఖ ఆధ్వర్యంలో జరగనున్న అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంలో ప్రదర్శించనున్నారు.

ఈ భవనాన్ని ఏమంటారు?

పాత శ్రీకాకుళం పరిధిలోని 80అడుగుల రోడ్డులో ఎన్‌టీఆర్ భవన్ పేరుతో కొనసాగుతున్న టీడీపీ కార్యాలయమిది. ఎంతో సుందరంగా కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి నిర్మించారు. 2019 ఎన్నికలకు నాలుగు నెలల ముందు ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు నాయుడు దీన్ని ప్రారంభించారు. రెండెకరాల ప్రభుత్వ స్థలంలో పార్టీ కార్యాలయం నిర్మించారు. అయితే ఈ స్థలాన్ని ఆ పార్టీ కొనుగోలు చేయలేదు. ఎన్నో ఏళ్ల కిందట దళితుల సంక్షేమం కోసం సేకరించి ఉన్న సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన స్థలాన్ని 2014-19లో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు తన పార్టీ కార్యాలయం కోసం కట్టబెట్టేశారు. ఆ సమయంలో ఇక్కడ ఎకరా రూ. 30కోట్లకు పైగా ఉండేది. ఇప్పుడు రూ.40 కోట్లు దాటిపోయింది. దాదాపు రూ. 60కోట్ల నుంచి రూ.80కోట్ల విలువైన ఈ రెండెకరాల భూమిని సంవత్సరానికి రూ. 25వేలు ఫీజుతో లీజుకింద కేటాయించారు. అంతటితో ఆగలేదు. 33 ఏళ్లకు ఇవ్వాల్సిన లీజును 99 ఏళ్లకు ఇస్తున్నట్టు నిబంధనలు కూడా మార్చారు. పోనీ అనుమతులైనా తీసుకున్నారా.. అంటే అదీ లేదు. వుడా, టౌన్ ప్లానింగ్ అధికారుల అనుమతులు లేకుండానే ఏకంగా (జీప్లస్2) రెండు అంతస్తుల భవనాన్ని నిర్మించేశారు. పనిలో పనిగా పక్కనున్న కొంత స్థలాన్ని ఆక్రమించేసి నిర్మాణం చేపట్టారు.



రూ. 80కోట్ల విలువైన ప్రభుత్వ స్థలంలో నిర్మించిన టీడీపీ కార్యాలయ భవనం

- శ్రీకాకుళంలో నిబంధనలకు విరుద్ధంగా టీడీపీ కార్యాలయ నిర్మాణం
- 99 ఏళ్లకు స్థలాన్ని లీజుకు ఇచ్చేసిన వైనం
- దళితుల ఇళ్ల కోసం కొనుగోలు చేసిన భూముల్లో పార్టీ కార్యాలయం నిర్మాణం
- రూ. 60కోట్ల నుంచి రూ.80కోట్ల విలువైన భూమిలో అనుమతులు పొందకుండా కట్టడం
- ప్లాన్ కోసం రూ. 6లక్షల 7వేల 50 ఫీజు చెల్లించాలన్న కార్పొరేషన్
- పట్టించుకోకుండా వదిలేసిన వైనం
- ఇన్ని అక్రమాలకు పాల్పడి వైఎస్సార్‌సీపీ కార్యాలయాలపై దుష్ప్రచారం



VISAKHAPATNAM URBAN DEVELOPMENT AUTHORITY

ఆక్రమిత స్థలంలో నిర్మించిన టీడీపీ భవనం ప్రహరీని తొలగించాలని ఆదేశిస్తూ వుడా అధికారులు జారీ చేసిన సర్క్యులర్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

టీడీపీ కడితే అది పార్టీ కార్యాలయం.. అదే వైఎస్సార్‌సీపీ నిర్మిస్తే మాత్రం ప్యాలెస్. టీడీపీ ఆధ్వర్యంలో 99 ఏళ్లకు లీజుకు ఇచ్చేసినా చట్టబద్ధం .. అదే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో లీజుకు తీసుకుంటే మాత్రం అక్రమం. టీడీపీ చేస్తున్న ఈ దుష్ప్రచార పర్వం పతాక స్థాయికి చేరుకుంటోంది. రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ కార్యాలయాలపై జరుగుతున్న దాడులు, దాన్ని సమర్థిస్తూ టీడీపీ నాయకులు చేస్తున్న ప్రచారాలు చూసి జనం ముక్కున వేలేసుకుంటున్నారు. గుర్తింపు ఉన్న రాజకీయ పార్టీలకు కార్యాలయాల కోసం ప్రభుత్వ భూములను కేటాయించవచ్చు అన్న నిబంధనలు ఎప్పటి నుంచో ఉన్నాయి. ఆ నిబంధనల ప్రకారమే అన్ని రాజకీయ పార్టీలు భూములు లీజుకు తీసుకుని తమ కార్యాలయాలను నిర్మించుకుంటాయి. కానీ టీడీపీ ప్రభుత్వ భూములు తీసుకుని కార్యాలయాలు నిర్మిస్తే... అవేమో పార్టీ కార్యాలయాలు.. వైఎస్సార్ సీపీ శ్రీకాకుళానికి శివారులో పెదపాడుకు సమీపంలో కేటాయించిన భూమిలో కార్యాలయం నిర్మిస్తే మాత్రం ప్యాలెస్ అంటూ వెగటు ప్రచారం చేస్తున్నారు. సాక్షాత్తు రాష్ట్ర మంత్రి, చంద్రబాబు తనయుడు లోకేష్ ఆ రకంగా ట్వీట్ చేసి ప్రజల్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు.

అనుమతుల్లేకుండానే

శ్రీకాకుళంలో జీ ప్లస్2 భవనం కోసం 2017 ఫిబ్రవరిలో విశాఖ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వుడా) అధికారులకు అప్పటి పార్టీ జిల్లా అధ్యక్షురాలు గౌతు శిరీష దరఖాస్తు చేశారు. ఆ మేరకు వుడా, కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన చేసి వివిధ ఫీజులతో పాటు బెటర్‌మెంట్ చార్జి కింద రూ. 6లక్షల 7వేల 50 చెల్లించాలని నోటీసు జారీ చేశారు. అయితే, ఇంత మొత్తం చెల్లించలేమని, రెండెకరాల విస్తీర్ణం ఉన్నప్పటికీ కేవలం 25సెంట్లలో మాత్రమే నిర్మాణం చేపట్టామని, ఆ మేరకు తమకు ప్లాన్ అనుమతి ఇవ్వాలని టీడీపీ నేతలు మళ్లీ కోరారు. ఆ అధికారం తమకు లేదని, మొత్తం విస్తీర్ణాన్నే పరిగణనలోకి తీసుకుంటామని, భవనం మేరకు ప్లాన్ ఇవ్వలేమని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని అధికారులు స్పష్టం చేశారు. కట్టడం ఎంత ఉన్నా ప్రహరీతో కూడిన విస్తీర్ణానికే ప్లాన్ తీసుకోవాలి. ఆ మేరకు కార్పొరేషన్ అధికారులు నిర్దేశించిన ఫీజు చెల్లించి అనుమతి పొందాలి. కానీ బెటర్‌మెంట్ చార్జీ ఎక్కువగా ఉందని చెప్పి రెండెకరాల విస్తీర్ణంలో ప్రహరీ, భవనం నిర్మించినా కేవలం భవనానికే మాత్రమే ప్లాన్ అప్రూవల్ ఇవ్వాలని అధికారులపై కత్తి పెట్టారు. ఇది పూర్తిగా నిబంధనలకు విరుద్ధం. అలా చేయలేమని చెప్పగానే ప్రభుత్వానికి పంపిస్తే తాము అక్కడ పని చేయించుకుంటామని బలవంతంగా అధికారుల ద్వారా ఫైలు పెట్టించుకున్నారు. ప్రభుత్వం వారిదే కావడంతో ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చి సానుకూలంగా చేయించుకున్నారు.


తమ మచ్చను చూసుకోకుండా

పార్టీ కార్యాలయాల కోసం స్థలాలు కేటాయింపులు చేసేందుకు తగు నిబంధనలు ఉన్నాయి. గుర్తింపు కలిగిన పార్టీ రాష్ట్ర, జిల్లా కార్యాలయాల కోసం 33 ఏళ్లకు లీజు కింద నామినల్ ఫీజుతో కేటాయించవచ్చు. కానీ అప్పటి చంద్రబాబు ప్రభుత్వం ఆ జీఓను కాదని కొన్ని షరతులు పెట్టి శ్రీకాకుళంలో భూమిని 99 ఏళ్లకు లీజుకని తీసుకుంది. అదేమీ నిరుపయోగంగా ఉన్న భూమి కాదు. షెడ్యూల్ కులాల ఇళ్ల స్థలాల కోసం సాంఘిక సంక్షేమ శాఖ కొన్నేళ్ల క్రితం రైతుల నుంచి కొనుగోలు చేసి సేకరించిన భూమి అది. దాన్ని 2015 సెప్టెంబర్ 4వ తేదీన టీడీపీ కార్యాలయం కోసం కేటాయించేశారు. టౌన్ సర్వే నంబర్ 700-1లో 1.29ఎకరాలు, టౌన్ సర్వే నంబర్ 701-1లో 71సెంట్లు భూమిని టీడీపీకి అప్పగించేశారు.

వెలుగు చూసిన ఆక్రమణ

ప్రభుత్వ ఉన్నతాధికారులు 25 సెంట్లకే ప్లాన్ అప్రూవల్ చేయాలని ఆదేశాలు ఇవ్వడమే తరువాయి వుడా అధికారులు జాగ్రత్తపడ్డారు. ఇదేదో సమస్యగా మారి ఇబ్బంది వచ్చే అవకాశం ఉందని తమకున్న అభ్యంతరాలను లిఖిత పూర్వకంగా రాసి పెట్టారు. టీడీపీ భవన్‌కు దక్షిణ వైపు ఉన్న రోడ్డుకు ఆనుకుని కొంత ఆక్రమిత స్థలంలో ప్రహరీ నిర్మించారని, దాన్ని తొలగించి, రిమార్క్సుతో కూడిన ప్లాన్ ఫైలు పెట్టాలని మరో ఉత్తర్వు జారీ చేశారు. ఇదే విషయాన్ని టీడీపీ నేతల దృష్టికి కార్పొరేషన్ అధికారులు తీసుకెళ్లారు. కానీ వారంతా గమ్మున ఉండిపోయారు. అధికారం చేతిలో ఉంది ఎవరేం చేస్తారు అన్న ధోరణితో వుడా అధికారులు సూచించిన విధంగా ప్లాన్‌కు దరఖాస్తు పెట్టుకోలేదు. ప్లాన్ అనుమతి పొందకుండానే చంద్రబాబు చేతుల మీదుగా అట్టహాసంగా కార్యాలయాన్ని ప్రారంభోత్సవం చేయించారు.

రాష్ట్రంలో తాజాగా మొదలైన టీడీపీ పాలనలో వైఎస్సార్‌సీపీకి సంబంధించిన ఆస్తులను ఎలాగైనా ధ్వంసం చేయాలన్న ఆలోచనతో నిర్మాణంలో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయాలకు వెళ్లి ఆరా తీయడం, లేదంటే నోటీసులంటించి అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. మరి 80 అడుగుల రోడ్డులో అనుమతుల్లేకుండా ఎప్పుడో నిర్మించిన టీడీపీ కార్యాలయం వైపు వెళ్తారో అధికారంలో టీడీపీ ఉందని చూసీ చూడనట్టు వదిలేస్తారో చూడాలి.



ప్లాన్ అప్రూవల్ కోసం రూ. 6లక్షల 7వేల 50 చెల్లించాలని అప్పటి కార్పొరేషన్ అధికారులు జారీ చేసిన ఎండార్స్‌మెంట్

సేవల్లో లోపం.. రోగులకు శాపం



నరసన్నపేట ఏరియా ఆస్పత్రి



- మధ్యాహ్నం విధులకు డుమ్మా కొడుతున్న డాక్టర్లు
- 21 మంది వైద్యులను నియమించినా వైద్య విద్యార్థులే దిక్కు
- నరసన్నపేట ఆస్పత్రిలో వైద్యుల సేవలపై సర్వత్రా నిరసన

నరసన్నపేట: సౌకర్యవంతమైన భవనాలను సమకూర్చారు. నిపుణులైన వైద్యులను నియమించారు. ఇతర సిబ్బందితో పాటు అవసరమైన నాణ్యమైన పరికరాలను అందుబాటులో ఉంచారు. సామాజిక ఆస్పత్రి స్థాయి నుంచి ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. చిన్న పిల్లల కోసం ప్రత్యేకంగా ఎస్ఎన్‌యూ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ఒకప్పుడు ఐదే ఐదుగురు డాక్టర్లు ఉండగా.. ఏకంగా 21 మందిని నియమించారు. ఇన్ని చేశాక కూడా.. వైద్యుల నిర్వాకం కారణంగా నరసన్నపేట ఏరియా ఆస్పత్రి రోగులకు సేవలు అందించలేకపోతోంది. ముఖ్యంగా మధ్యాహ్నం వేళ డాక్టర్లు అందుబాటులో లేక వైద్య విద్యార్థులతో నెట్టుకురావాల్సిన దుస్థితి ఏర్పడింది. చాలా మంది డాక్టర్లు సొంత ప్రాక్టీసుకు ప్రాధాన్యత ఇస్తూ.. అసలు సేవలపై అలసత్వం ప్రదర్శిస్తుండడంతో ఆస్పత్రిపై ఆధారపడిన వారికి నిరాశ తప్పడం లేదు. వైద్యులు, సిబ్బంది హాజరును మెరుగు పరిచేందుకు (ఎఫ్ఆర్ఎస్) ఫేస్ డిటెక్షన్ అటెండెన్స్‌ను వినియోగంలోకి తీసుకువచ్చినా వైద్యుల తీరులో మార్పు లేదు.

ఒక పూటకే పరిమితం..

ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకూ వైద్యులు ఆస్పత్రిలో ఉండాలి. కానీ నరసన్నపేట ఆస్పత్రి వైద్యులు మాత్రం సమయపాలన పాటించిన దాఖలాలే లేవు. ఉదయం 9 నుంచి 10 గంటల లోపు ఆస్పత్రికి రావడం 12 కల్లా వెళ్లిపోవడం పరిపాటిగా మారింది. ఒకరిద్దరు తప్ప ఎవరూ సాయంత్రం వరకు ఉండడం లేదు. కొంతమంది డాక్టర్లైతే ఆస్పత్రికే రావడం లేదు. ఒక్క గైనిక్ విభాగంలోని వైద్యుల సేవలు మాత్రమే సంతృప్తిగా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల ఆస్పత్రిలో వైద్యులు ఉండటం లేదని స్థానికులు ఫిర్యాదు చేయగా వైద్య శాఖ రీజనల్ డైరెక్టర్ రామగిడ్డయ్య శ్రీకాకుళం డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఎంక్వైరీ చేశారు. అయినా వైద్యుల తీరులో మార్పు లేదు.



అత్యసవర విభాగంలో రోగులతో మాట్లాడుతున్న వైద్య విద్యార్థులు

21 మంది వైద్యులు..

స్థానిక ఏరియా ఆస్పత్రిలో జనరల్ సర్జరీ వైద్యులు ఇద్దరు, ఆప్తాలమిక్, పాథాలజీ (లేబ్ రిపోర్టులు ఇవ్వాలి)ఈఎన్‌టీ, ఎనస్థీషియా ఇద్దరు చొప్పున, గైనిక్ ముగ్గురు, స్కిన్, ఆర్థో, జనరల్ మెడిషన్ ఒక్కొక్కరు ఉన్నారు. వీరితోపాటు ఎంబీబీఎస్ ముగ్గురు, చిన్నపిల్లల వైద్యులు ఇద్దరు ఇలా మొత్తం 21 మంది వైద్యులను ప్రభుత్వం నియమించింది. ఇంత మంది వైద్యులను ప్రభుత్వం నియమించినా ప్రస్తుతానికి ఆస్పత్రిలో అధికంగా సేవలు చేస్తున్న వైద్యులు మాత్రం వైద్య విద్యార్థులే. రిమ్స్, జెమ్స్ ఆస్పత్రుల నుంచి వస్తున్న ట్రైనీ డాక్టర్లకు బాధ్యతలు అప్పగించి ప్రధాన వైద్యులు తమ విధులకు డుమ్మా కొడుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా..



ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో వైద్యులు ఉన్నారు. అయితే వారి సేవలు అంతంతగానే ఉన్నాయి. నిబంధనలు పాటించడం లేదు. సమయ వేళలు పట్టించుకోవడం లేదు. ఈ విషయాన్ని నేనూ గమనించా. పలు మార్లు హెచ్చరికలు చేశాను. వారిలో మార్పు రావడం లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే పై అధికారుల దృష్టికి తీసుకువెళ్తాను. వైద్యుల పనితీరు మెరుగుకు తగు చర్యలు తీసుకుంటాను.

– జయశ్రీ, ఆసుపత్రి సూపరింటెండెంట్

12 అయితే ఆస్పత్రి ఖాళీ..



వైద్యులు సక్రమంగా ఉండటం లేదు. కొందరైతే పూర్తిగా రావడం లేదు. దీంతో రోగులకు సక్రమంగా సేవలు అందడం లేదు. 12 గంటల తర్వాత ఆస్పత్రి ఖాళీ అయిపోతోంది. వైద్యులు పూర్తి స్థాయిలో ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కోటిపల్లి శ్రీను, బొడ్డవలస, నరసన్నపేట



సాయంత్రం ఖాళీగా ఉన్న వైద్యుల సీట్లు

'117 జీఓను రద్దు చేయాలి'



హరిపురంలో మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.రఘువర్మ

కాశీబుగ్గ: గత ప్రభుత్వ కాలంలో విలీనం చేసిన 3,4,5 తరగతులను యథావిధిగా కొనసాగించాలని మందస మండలం హరిపురం ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన ఏపీటీఎఫ్ విద్యా సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.రఘువర్మ కోరారు. ప్రస్తుత ప్రభుత్వం ఇంతకు ముందు ఇచ్చిన హామీ మేరకు 117 జీఓను రద్దు చేయాలని కోరారు. ఉదయం పూట జరిగిన విద్యా సదస్సులో విద్యారంగం కొత్త ప్రభుత్వం కొత్త ఆశలు అనే అంశంపై భానుమూర్తి ప్రధాన వక్తగా మాట్లాడారు. నేడు ఉపాధ్యాయులు పాఠశాలలో స్వేచ్ఛగా పని చేసే పరిస్థితి లేదని, ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి తప్పించాలని అదే విధంగా ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించాలని కోరారు. అనంతరం వీవీ వరప్రసాద్ సేవలను గుర్తు చేసుకుంటూ ఆయనను అభినందించారు. కార్యక్రమంలో స్థానిక ప్రధానోపాధ్యాయులు జి. ఉమారాజ్, పీఎంసీ చైర్‌పర్సన్, వి.కళ, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యం.మదన్ మోహన్, ఎస్వీ అనిల్‌కుమార్, జిల్లా సబ్ కమిటీ సభ్యులు జి.భీమారావు, రామ్మోహన్, సీహెచ్ శ్రీనివాస్, బి.ఢిల్లీశ్వరరావు, కె.గోపికృష్ణ, ఎస్.చాణక్య, జి.రాజేష్, పి.తిరుమలరావు, మందస ఎపిటియఫ్ అధ్యక్షుడు, ప్రధానకార్యదర్శి యస్ కిరణ్‌కుమార్, కె.సుందరరావు, మందస మండల కార్యవర్గ సభ్యులు డి.చంద్రశేఖర్, ఎస్.కరుణాకర్, కె.జగదీశ్వరరావు, బి.మురళీమోహన్, సుశాంత్‌కుమార్‌రౌలో, డి.వైకుంఠరావు, ఎస్.ఢిల్లీశ్వరరావు, బి.భైరాగి, కె.చిరంజీవి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్యూషన్‌కు వెళ్తానని చెప్పి.. విద్యార్థి అదృశ్యం



తాళ్లభద్ర చైతన్య

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి రోటరీనగర్ ఎస్ఎఫ్ఎస్ స్కూల్ విద్యార్థి తాళ్లభద్ర చైతన్య(13) అదృశ్యమైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నందిగాం మండలం బడగాం గ్రామానికి చెందిన తాళ్లభద్ర చంద్రరావు కుమారుడు చైతన్య ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. ట్యూషన్‌కు వెళ్తానని చెప్పి తిరిగి రాకపోవడంతో ఆందోళనకి గురై చుట్టుపక్కల అంతా గాలించారు. ఎక్కడా కనిపించకపోవడంతో కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎక్కడైనా కనిపిస్తే వెంటనే ఈ నంబర్‌కు 9542788683 కు తెలియజేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిప్పు కణికల మధ్య కాళిక



కాళీమాత వేషధారణతో అగ్ని గుండం మధ్య నృత్యం చేస్తున్న కళాకారుడు

ధనరాజుల తులసమ్మ ఉత్సవంలో కాళికామాత వేషధారి అదరగొట్టారు. అగ్ని గుండం మధ్య నృత్యం చేస్తూ భక్తులను అబ్బురపరిచారు. లొద్దపుట్టిలో జరిగిన ఈ ఉత్సవాన్ని తిలకించి భక్తులు తన్మయత్వం పొందారు.

– ఇచ్ఛాపురం రూరల్



ధనరాజులమ్మ తులసమ్మ ఆలయం వద్ద కోయనృత్యం చేస్తున్న కళాకారులు

ముగిసిన మొదటి విడత ఐటీఐ కౌన్సెలింగ్

- 634 మందికి ప్రవేశాలు
- మిగులు సీట్లు 2974
- హాజరు కాని, సీట్లు రాని విద్యార్థుల కోసం 25, 26 తేదీల్లో కౌన్సెలింగ్

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలో మూడు ప్రభుత్వ, 20 ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశాలకు నిర్వహించిన మొదటి విడత కౌన్సెలింగ్ ముగిసింది. ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 18 నుంచి ఆదివారం వరకు ప్రవేశాల కోసం కౌన్సెలింగ్ నిర్వహించారు. చివరి రోజు 2304 ర్యాంకు నుంచి 2470 ర్యాంకు వరకు ప్రవేశాలు నిర్వహించగా, 165 మందికి 73 మంది హాజరయ్యారు. 34 మంది ప్రవేశాలు పొందారు. మొత్తం కౌన్సెలింగ్‌లో 634 మంది ప్రవేశాలు పొందారు. జిల్లాలోని 23 ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో 3608 సీట్లు ఉండగా, 2974 సీట్లు మిగిలిపోయాయి. దరఖాస్తు చేసి హాజరై సీట్లు రానివారు, హాజరు కాని వారికోసం ఈ నెల 25, 26 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ప్రాధాన్యత గల ట్రేడుల్లో ప్రత్యేక రిజర్వేషన్లతో తప్ప, మిగతా సీట్లు నిండిపోయాయి.



ప్రైవేట్ ఐటీఐల్లో తక్కువగా ప్రవేశాలు జరిగాయి. రెండో విడత కౌన్సెలింగ్‌లో ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశాలు జరిగే అవకాశం ఉంది. ఈ కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రవేశాల కన్వీనర్, ఎచ్చెర్ల ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్‌రావు, ప్లేస్‌మెంట్ అధికారి కామేశ్వరరావు పర్యవేక్షించారు.

క్లుప్తంగా

గౌరీశంకర్ కథకు పురస్కారం



విశాఖలో పురస్కారం అందుకుంటున్న గౌరీశంకర్

శ్రీకాకుళం కల్చరల్: అగనంపూడి కంచిపూడి గురుమూర్తి స్మారక రాష్ట్రస్థాయి కథ, కవితల పోటీలో గాయత్రీ కళాశాల తెలుగు విభాగాధిపతి భమిడిపాటి గౌరీశంకర్ రచించిన కథకు పురస్కారం లభించింది. ఈ సందర్భంగా నిర్వాహకులు శనివారం గౌరీశంకర్‌ను సినీ నటుడు, దర్శక, నిర్మాత ప్రసన్నకుమార్ చేతుల మీదుగా నగదు, ప్రశంసాపత్రం, శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా విద్యా సంస్థల అధినేత జీవీ స్వామినాయుడు, ప్రిన్సిపాల్ డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు, అధ్యాపక బృందం ఆయనను అభినందించారు.

ఒడియా పిల్లల సంఖ్య పెంచాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డీఐ డీపీ చౌదరి

సోంపేట: ప్రభుత్వ పాఠశాలల్లో ఒడియా పిల్లల సంఖ్య పెంచాలని ఒడియా డీఐ డీపీ చౌదరి అన్నారు. సోంపేట, కంచిలి మండలాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఒడియా ఉపాధ్యాయులతో ఆదివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. బడికి పోదాం కార్యక్రమంలో భాగంగా ఒడియా ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల సంఖ్య పెంచాలని సూచించారు. సమావేశంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర పాడి, బృందావన్ దొళాయి మాట్లాడుతూ ఖాళీగా ఉన్న ఒడియా ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యక్షుడు రామహరి పాడి, సంయుక్త కార్యదర్శి సుదర్శన బెహరా తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాకర్షక కాలభైరవస్వామి



శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం బలగ నాగావళి తీరంలో వేంచేసిన బాలాత్రిపుర కాలభైరవ స్వామి పీఠం ఆలయంలో ఆదివారం స్వామికి అభిషేకాలు నిర్వహించారు. అభిషేకాల అనంతరం స్వామిని స్వర్ణాకర్షక భైరవ స్వామిగా అలంకరించారు.

పాలరాతి విగ్రహం అపహరణ



అపహరణకు గురైన పాలరాతి గణపతి విగ్రహం (ఫైల్)

పోలాకి: స్థానిక సాయి మందిరంలో ఉన్న పాలరాతి గణపతి విగ్రహాన్ని శనివారం దొంగలు అపహరించినట్లు ఆలయ కమిటీ సభ్యుడు పాట్నూరు రమణమూర్తి తెలిపారు. ఇరవై ఏళ్ల క్రితం రాజస్థాన్ నుంచి ప్రత్యేకంగా తెప్పించి ఇక్కడ ప్రతిష్ఠ చేశారు. నిత్యం పూజలు అందుకునే గణపతి దేవునికే రక్షణ లేకుండా పోయిందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రుణ పరపతి పెరిగింది



- పంటల పెట్టుబడికి తక్కువ వడ్డీకే రుణం మంజూరు చేస్తున్న బ్యాంకులు
- ఈ ఏడాది కూడా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌లో భారీగా పెరుగుదల
- వరికి గరిష్టంగా రూ. 46 వేలు
- మిగిలిన పంటలకూ ఇదే రకంగా రుణ పరపతి పెంపు

నరసన్నపేట: జిల్లాలో పండించిన పంటలకు 2024/25 ఆర్థిక సంవత్సరానికి పంటరుణాల పరపతి(స్కేల్‌ఆఫ్ ఫైనాన్స్) ఖరారైంది. ఈ నివేదికలు జిల్లా వ్యాప్తంగా బ్యాంకులకు చేరాయి. పెట్టుబడి వ్యయాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ గత ఏడాది డిసెంబర్‌లోనే అప్పటి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన టెక్నికల్ కమిటీ సమావేశమై స్కేల్‌ఆఫ్ ఫైనాన్స్‌ను నిర్ణయించింది. నివేదికను రాష్ట్ర కమిటీకి పంపించగా చిన్న మార్పులు చేసి ఆమోదించారు. తాజాగా దీన్ని కలెక్టర్ ఆమోదించారు. కేంద్ర సహకార సీఈఓ డి.వరప్రసాదరావు, ఎల్‌డీఎం సూర్య కిరణ్‌ల ద్వారా అన్ని బ్యాంకులకూ సమాచారం పంపారు. జిల్లా వ్యాప్తంగా 2.50 లక్షల మంది రైతులకు ప్రయోజనం కలగనుంది. ఇప్పటికే కొన్ని బ్యాంకులు ఖరీఫ్ రుణాలు ఇవ్వడం ప్రారంభించాయి. అలాగే జిల్లా వ్యాప్తంగా అర్హత కలిగిన ప్రతి రైతుకూ తన భూమి విస్తీర్ణం మేరకు పంట రుణాలు ఇవ్వాలని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ సూర్యకిరణ్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో ప్రధాన పంటలైన వరి, రాగి, మొక్కజొన్న వేరుశనగ, చెరకు తదితర పంటలకు రుణ పరపతి బాగా పెరిగింది.

పంట రుణాల పరపతి ఇలా ఉంది..	
పంట పేరు	స్కేల్‌ఆఫ్ ఫైనాన్స్
వరి	రూ. 46,000
జొన్న	రూ.21,000
చోడి	రూ. 20,000
మొక్కజొన్న(రబీ)	రూ.44,000
మొక్కజొన్న (ఖరీఫ్)	రూ. 28,000
సన్‌ఫ్లవర్	రూ. 24,000
వేరుశనగ	రూ. 35,000
పత్తి	రూ. 45,000
చెరకు	రూ, 74,000
మిరప(రెడ్)	రూ. 98,000
టమాటా	రూ.38,500
జీడి	రూ. 37,000
అరటి	రూ.55,000
ఆయిల్‌పామ్	రూ.40,500

స్కేల్‌ఆఫ్ ఫైనాన్స్ అమలు చేయండి



ఈ ఆర్థిక సంవత్సరానికి పంటలకు రుణ పరపతిని ప్రకటించారు. దీని ప్రకారం బ్యాంకు సిబ్బంది అందరూ అర్హత మేరకు రైతులకు రుణాలు ఇవ్వాలి. విరివిగా ఇవ్వడం మంచిది. రైతులను ఇబ్బంది పెట్టకూడదు. బ్యాంకుల వారీగా అందరికీ లక్ష్యాలు ఇవ్వడం జరుగుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని బ్యాంకు సిబ్బంది రైతులకు రుణాలు ఇవ్వండి. రైతులు కూడా వినియోగించుకోవాలి.

– సూర్యకిరణ్, లీడ్ బ్యాంకు మేనేజర్

కళింగ కోమట్ల నూతన కార్యవర్గం ఎన్నిక



కళింగ కోమట్ల నూతన అధ్యక్షుడు గోవిందరాజులును అభినందిస్తున్న పెద్దలు

శ్రీకాకుళం: శ్రీకాకుళంలోని కళింగ వైశ్య భవన్‌లో ఆదివారం జరిగిన కళింగ కోమట్ల విస్తృత స్థాయి సమావేశంలో నూతన కార్యవర్గ ఎన్నికలను ఏకగ్రీవంగా నిర్వహించారు. ఈ కార్యవర్గంలో కళింగ కోమటి రాష్ట్ర శాఖ అధ్యక్షునిగా బోయిన గోవింద రాజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మాజీ అధ్యక్షుడు కోణార్క్ శ్రీను అధ్యక్షతన జరిగిన ఎన్నికల్లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం మన్యం పార్వతీపురం జిల్లాల నుంచి మండల, నియోజక వర్గం, జిల్లా స్థాయి నుంచి ఆ సామాజిక వర్గం ప్రతినిధులతో పాటు అనేక మంది పాల్గొన్నారు. నూతన అధ్యక్షుడు బోయిన గోవిందరాజులు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న ఎన్‌డీఏ, రాష్ట్రంలో ఉన్న తెలుగుదేశం, జనసేన, బీజేపీల నాయకులు, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్నాయుడు సారథ్యంలో ఓబీసీ సాధనకు కృషి చేస్తానని తెలిపారు.

ముగిసిన ఫస్ట్ ఎయిడ్ శిక్షణ



ఫస్ట్ ఎయిడ్‌లో శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం

శ్రీకాకుళం కల్చరల్: రెడ్‌క్రాస్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న ప్రొఫెషనల్ ఫస్ట్ ఎయిడ్ శిక్షణ ఆదివారంతో ముగిింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 20 మంది విద్యార్థులకు డాక్టర్ శ్రీకాంత్, రెడ్‌క్రాస్ ప్రోగ్రాం మేనేజర్ గొలివి రమణ ప్రథమ చికిత్సపై శిక్షణ ఇచ్చారు. శిక్షణలో భాగంగా సీపీఆర్‌పై అవగాహన, విపత్తుల సమయాల్లో గాయాలకు కట్టు కట్టడం, పాము కాటు, తేలుకాటు, గుండెపోటు వచ్చిన వారికి ప్రథమ చికిత్స, కరెంటు షాక్ తగిలిన వారికి, రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి ప్రథమ చికిత్స మరిన్ని అంశాలపై శిక్షణ ఇచ్చారు. సామాన్యులకు కూడా ప్రథమ చికిత్సపై అవగాహన ఉండి తీరాలని తద్వారా విపత్తుల సమయంలో ప్రథమ చికిత్స చేయవచ్చని రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు అన్నారు. శిక్షణానంతరం చైర్మన్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సెక్రటరీ బి.మల్లేశ్వరరావు, ఏఓ నర్సింగరావు, మేనేజర్ గుణాకరరావు, మేనేజింగ్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మెళియాపుట్టి : ఆటో బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని కొత్తమారడికోట చీడిపాలెం గ్రామాల మధ్యలో ఆదివారం సాయంత్రం 7.30 ప్రాంతంలో జాడుపల్లి గ్రామం వైపు ఒక ఆటో మారడికోట గ్రామం వైపు రాగా.. ఎర్రమానుగూడ, ఎర్రమానుగూడ కాలనీలకు చెందిన సవర ఖగేష్, సవర మహేష్ అనే ఇద్దరు బైక్‌పై వచ్చి ఆటోను ఢీకొన్నారు. దీంతో ఇద్దరికీ బలమైన దెబ్బలు తగిలాయి. 108 ద్వారా స్థానికులు టెక్కలి ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

జర్నలిస్టు పిల్లలకు రాయితీపై వినతి



మంత్రి పార్థసారథిని కలిసిన జర్నలిస్టు నాయకులు జోగినాయుడు తదితరులు

శ్రీకాకుళం: ప్రైవేటు స్కూల్స్‌లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు వంద శాతం రాయితీ కల్పించాలని జర్నలిస్టుల ఫోరం కార్యదర్శి శాసపు జోగినాయుడు, శ్రీకాకుళం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.రవి, బి.శ్రీధర్‌లు రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పార్థసారథిని కోరారు. విజయవాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆదివారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు జర్నలిస్టు పిల్లలకు ప్రైవేటు స్కూల్స్‌లో 100 శాతం రాయితీ కల్పించారని గుర్తు చేశారు. మళ్లీ అదే విధానం అమలు చేయాలని కోరారు. అక్రిడేషన్‌తో సంబంధం లేకుండా అందరికీ ఇళ్ల స్థలాలు, కాలనీ ఇళ్లు ఇవ్వాలని కోరారు. త్వరలోనే జర్నలిస్టు సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి జర్నలిస్టుల సంక్షేమానికి తగిన నిర్ణయాలు తీసుకుంటామని మంత్రి పార్థ సారథి తెలిపారు. కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంబరం



జగతి గ్రామంలో నిర్వహిస్తున్న మర్ల పోలమ్మ చల్లదన ఉత్సవం

కవిటి: మండలంలోని జగతి గ్రామ దేవత మర్ల పోలమ్మ అమ్మవారి సంబరం అంబరాన్నంటింది. ఏటా నిర్వహించే మర్ల పోలమ్మ చల్లదనం ఆదివారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ప్రతిరూపంగా భావించే గజముద్దలను, కాళీవేషాలను మేళతాళాలతో గ్రామవీధుల్లో ఊరేగించారు. వీధి నాటకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి

క్రీడలతో మానసిక ఉల్లాసం

శ్రీకాకుళం న్యూకాలనీ: క్రీడలతోనే మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందని యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని యువనాయకుడు, క్రీడా ప్రోత్సాహకులు చీమల తారకేశ్వరరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని నాగావళి నది ఒడ్డున ఆదివారం సాయంత్రం తారకేశ్వరరావు తన సొంత ఖర్చులతో ఫ్లడ్ లైట్ల ఏర్పాటుతో నిర్మించిన వాలీబాల్ కోర్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాల బారిన పడకుండా ప్రతి రోజూ కొంత సమయం ఆటలపై దృష్టి సారించాలని కోరారు. స్థానికంగా ఉంటున్న యువకులు ఆడుకునేందుకు సరైన స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారని, వారి కోసం ఈ ఆట స్థలాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తిగా మెలిగి సోదరాభావాన్ని పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంతోష్, సతీష్, భవాని, బుజ్జి, ప్రసాద్, తరుణ్, సాహుకారి శ్రీను, సాయి, చిన్ని జగదీష్, గోపాల్, సుధీర్, కుమార్, సంతోష్‌కుమార్, చిన్న తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభించిన వాలీబాల్ కోర్టులో ఫ్లడ్‌లైట్ల వెలుతురు మధ్య ఆడుతున్న యువత

చోరీపై కేసు నమోదు

టెక్కలి రూరల్: మండలంలోని నౌపడ ఆర్‌ఎస్ గ్రామానికి చెందిన ఉప్పాడ నరసమ్మ అనే మహిళ గత నెల 31వ తేదీన ఆటోలో టెక్కలి వస్తుండగా తన మెడలో ఉన్న 2.5 తులాల బంగారు తాడు, దానికి ఉన్న తులం బరువు గల 4 కాసులు దొంగిలించారు. ఆమె చేసిన ఫిర్యాదు మేరకు గాలింపు చేపట్టిన పోలీసులు సోంపేటలో అదే తరహాలో చోరీ చేసిన వ్యక్తిని పట్టుకున్నారు. అతడిని విచారించి శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లక్ష్మి ఆదివారం తెలిపారు.

ఆదిత్యునికి జ్యేష్ఠ మాస ప్రత్యేక పూజలు



తలనీలాల మొక్కుల కోసం బారులు తీరిన భక్తులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. జ్యేష్ఠ మాసం ప్రత్యేక ఆదివారం కావడంతో ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ఆదిత్యునికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పుష్పాలంకరణలో ఆదిత్యుని దర్శనం కోసం ఉదయం 6 గంటల నుంచి అనుమతివ్వడంతో దర్శనానికి భక్తులు బారులు తీరారు. దర్శనాలు సజావుగా జరిగేలా ఆలయ ఈఓ ఎస్.చంద్రశేఖర్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. కేశఖండన శాల టిక్కెట్ల విషయంలో తేడాలు వచ్చినట్లుగా సమాచారం రావడంతో ఆలయ ఈఓ చంద్రశేఖర్ స్వయంగా వెళ్లి తనిఖీ చేశారు. అలాగే అక్కడ విధుల్లో ఉన్న ఓ మహిళ వ్యవహారాన్ని కూడా పరిశీలించారు. అలాగే గ్రామీణ ప్రాంత మహిళలు ఇంద్రపుష్కరిణి వద్ద ప్రత్యేక సంప్రదాయక పూజలు చేసి ప్రత్యేక ప్రసాదాలను స్వామికి నివేదించారు. అలాగే ఆరోగ్యం కోసం సూర్యనమస్కారాల పూజలు చేయించుకున్నారు. జిల్లాకు చెందిన పలువురు అధికారులు ఆదిత్యుడిని దర్శించుకున్నారు. ఇక ఆదివారం వివిధ దర్శన టిక్కెట్ల విక్రయాలతో రూ.3,08,400, పూజలు విరాళాల ద్వారా రూ.71,749, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2.25 లక్షల వరకు ఆదాయం లభించినట్లుగా ఈఓ తెలిపారు.



భక్తులకు బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహిస్తున్న మెడికవర్ సిబ్బంది

నీలమణి దుర్గ ఆలయానికి పోటెత్తిన భక్తులు

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, పాతపట్నం గ్రామదేవత నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారి ఆలయానికి మంగళవారం తెల్లవారుజాము నుంచే స్థానికులతో పాటు ఒడిశా ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో వచ్చి ప్రత్యేక పూజలు, ఘటాలతో మొక్కులు చెల్లించారు. పలువురు వాహన పూజలు కూడా చేశారు.



ఆలయంలో క్యూలో ఉన్న భక్తులు

‘ప్రత్యేక హోదాతోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి’



రౌతు శంకరరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): విభజన హామీల్లో భాగంగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామన్న హామీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిలబెట్టుకోవాలని ఆల్ ఇండియా ఓబీసీ అసోసియేషన్, ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి రౌతు శంకరరావు కోరారు. కేంద్రంలో గత యూపీఏ ప్రభుత్వం, బీజేపీ ప్రభుత్వం మాట మార్చి ప్రత్యేక హోదా ముగింపు అధ్యాయమనడం సబబు కాదన్నారు. ఏపీని విడగొట్టి అటు రాజధాని లేక, ఇటు ప్రత్యేక హోదా లేకుండా తీవ్ర అన్యాయం చేశాయన్నారు. నిరుద్యోగం పోవాలన్నా.. యువత బంగారు భవిష్యత్ పొందాలంటే ప్రత్యేక హోదా ఒక్కటే మార్గమన్నారు. 2018లో 15వ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ ఎన్‌కే సింగ్ అమరావతిలో చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎక్కడా ప్రత్యేక హోదా ఇవ్వవద్దని చెప్పలేదని, 14వ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ కూడా అలా చెప్పలేదని స్పష్టం చేశారు. విశాఖ చెన్నై కారిడార్, కడప ఉక్కు పరిశ్రమ, దుగరాజపట్నం పోర్టు, వ్యవసాయ విశ్వవిద్యాలయం, విశాఖ రైల్వే జోన్ ఏపీ కూడా ఇప్పటివరకు నెరవేర్చకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటిపై దృష్టి సారించకపోతే తగిన మూల్యం చెల్లించుకుంటాయన్నారు.

ఢిల్లీలో వలస కూలీ మృతి



మృతుడు ఉప్పాడ మధుబాబు (ఫైల్)

నందిగాం: మండలంలోని బోరుభద్ర పంచాయతీ కామధేనువుకు చెందిన వలసకూలీ ఉప్పాడ మధుబాబు(36) దేశ రాజధాని న్యూఢిల్లీలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మధుబాబు మూడేళ్లుగా ఢిల్లీలో వలస కూలీగా పనిచేస్తూ తల్లిదండ్రులు, భార్య విజయకుమారి, కుమార్తె వర్షితను పోషించుకునేవాడు. అయితే గత నెలలో జరిగిన సార్వత్రిక ఎన్నికలకు గ్రామానికి వచ్చి ఓటు వేసి మళ్లీ ఢిల్లీ వెళ్లిపోయాడు. శుక్రవారం ఉదయం ఢిల్లీ రైల్వేస్టేషన్ సమీపంలో అపస్మారక స్థితిలో పడి ఉండగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఢిల్లీ లాల్‌బహదూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని జేబులో ఉన్న ఆధార్ కార్డు వివరాలను బట్టి నందిగాం పోలీసులకు సమాచారం అందించారు. నందిగాం పోలీసులు కామధేనువులో ఉన్న మృతుని భార్యకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల కోరిక మేరకు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు సమాచారం అందించగా.. ఆయన స్పందించి ప్రత్యేక విమానంలో మృతదేహాన్ని ఢిల్లీ నుంచి విశాఖపట్నంకు చేర్చారు. అక్కడ నుంచి అంబులెన్స్ ద్వారా గ్రామానికి తరలించారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

టెక్కలిలో చోరీ

టెక్కలి రూరల్: స్థానిక వేంకటేశ్వర కాలనీ–3లో ఆదివారం చోరీ జరిగినట్లు స్థానికులు గుర్తించారు. మేరకు టెక్కలి ఎస్ఐ లక్ష్మి తెలిపిన వివరాలు ప్రకారం.. సీఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ కుర్మాన పురుషోత్తం వేంకటేశ్వర కాలనీ–3లో మేడమీద ఇంటిలో నివాసం ఉంటున్నారు. ఆయన ఇంటి కింద గ్రానైట్ కంపెనీ ఉండేది. అయితే ఇంటి యజమాని కొద్ది రోజుల కిందట కుటుంబంతో కలిసి భువనేశ్వర్ వెళ్లారు. ఆదివారం ఇంటి తలుపులు, గ్రానైట్ కంపెనీ తలుపులు తెరిచి ఉండటం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ లక్ష్మి ఘటన స్థలానికి చేరుకుని ఇంట్లో దొంగలు పడినట్లు గుర్తించారు. అయితే ఇంటి యజమాని లేకపోవడంతో వారికి సమాచారం అందించారు.

సెమ్స్ ఒలింపియాడ్‌తో విద్యార్థులకు మేలు



బహుమతులు అందుకున్న విద్యార్థులు, ఉపాధ్యాయులతో సంస్థ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: డాక్టర్ అబ్దుల్ కలాం స్వచ్ఛంద సంస్థ ఆర్గనైజర్స్ నేషనల్ కోఆర్డినేటర్స్ ఏఆర్‌సీ రెడ్డి, ఎస్ఎన్ రెడ్డి ఆధ్వర్యంలో గత కొన్నేళ్ల నుంచి నిర్వహిస్తున్న సిమ్స్ ఒలింపియాడ్ నేషనల్ టాలెంట్ టెస్ట్‌తో విద్యార్థులకు అపారమైన జ్ఞానం లభిస్తుందని శ్రీకాకుళం జిల్లా విద్యాశాఖ అధికారి కె.వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం వరం రెసిడెన్సీలో జరిగిన అభినందన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి, జోనల్ స్థాయి ర్యాంకులు సాధించిన జిల్లా విద్యార్థులకు డీఈఓ చేతుల మీదుగా అవార్డులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మక శక్తితో పాటు వివిధ సబ్జెక్టులు సంబంధించి టాలెంట్ సెన్స్ ఒలింపియాడ్ నేషనల్ టాలెంట్ టెస్ట్ ద్వారా బయట పడుతుందన్నారు. ఇలాంటి సంస్థలు నిర్వహించిన టాలెంట్ సెర్చ్ పరీక్షల ద్వారా విద్యార్థులు తమ జ్ఞానాన్ని మేధాశక్తిని తెలుసుకోవచ్చన్నారు. నేషనల్ కోఆర్డినేటర్ ఎస్ఎన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఉపయోగపడే సెమ్స్ ఒలంపియాడ్ పరీక్షల్లో పాల్గొని భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లాలో గల వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులను గురుబ్రహ్మ అవార్డుతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కో ఆర్డినేటర్ జ్ఞానేశ్వర్, సూర్యనారాయణ, మండల కోఆర్డినేటర్లు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ర్యాంకర్లు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.